# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 197
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
మే 06, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## పోలీసుల పనితీరుపై సీపీ ఫోకస్



8లో..

- మామునూర్, ఏనుమాముల, గీసుగొండ పోలీస్ స్టేషన్ ల సందర్శన
- ఆర్థిక, సైబర్ నేరాల పై దృష్టి పెట్టాలని సూచన




2లో..

## తోటి ఉద్యోగినీ వదల్లే..

- మెడికల్ బిల్ కోసం రూ.60వేల డిమాండ్
- ఏసీబీకి చిక్కిన ఇద్దరు జడ్పీ ఉద్యోగులు



8లో..

## 7వ రోజుకు చేరిన..
## కల్యాణ బ్రహ్మోత్సవాలు

- ఉభయ దాతలుగా వ్యవహరించిన నాయీబ్రాహ్మణులు




2లో..

## బీజేపీని తరిమికొట్టాలి

- రాష్ట్ర నాయకుడు నవీన్ రాజ్
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్.. ర్యాలీ

- పలుకుబడి ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు
- ఎంపికలోనే ఇష్టారాజ్యం
- వెరిఫికేషన్ అధికారులపై ఇందిరమ్మ కమిటీల పెత్తనం
- పలుకుబడి ఉన్నవారికి ఫస్ట్ ప్రిఫరెన్స్
- నిరుపేదలకు తప్పని ఎదురుచూపులు






# అర్హులకు అన్యాయం

ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలకు సొంతింటి కల సాకారం అయ్యే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. వెరిఫికేషన్ అధికారులపై ఇందిరమ్మ కమిటీల పెత్తనం ఎక్కువ కావడంతో పలుచోట్ల ఈ పథకం అభాసుపాలవుతోంది. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్న ఉద్దేశంతో జల్లెడ పడుతున్న అధికారులు వారి స్థితిని చూసి ఎంపిక చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలుకుబడి ఉన్నవారికి ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోర్నకల్ మండలం పకీర తండా పరిధి తేనె తండాకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బానోతు భారతి తనకు నిలువ నీడ లేకపోవడంతో ఇందిరమ్మ గృహానికి అర్జీ పెట్టుకోగా ఫైనల్ లిస్టులో మంజూరు లభించింది. అయితే వెరిఫికేషన్ లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు ఆమె పేరును తొలగించారు. దీంతో స్థానిక నాయకుడి సూచన మేరకే తనకు మంజూరైన ఇంటిని వేరే వారికి బదలాయించారని బానోతు భారతి ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ను వేడుకుంటోంది. ఇలాంటి సంఘటనలు గ్రామాల్లో నిత్యకృత్యంగా మారుతున్నాయన్న విమర్శలున్నాయి. -వరంగల్ వాయిస్, దోర్నకల్

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
మంగళవారం, మే 06, 2025

# బీజేపీని తరిమికొట్టాలి

- రాష్ట్ర నాయకుడు నవీన్ రాజ్
- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు.. జై భీమ్ ర్యాలీ




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కొండా దంపతులు ఆదేశం మేరకు మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దేశాయిపేట్ బొడ్రాయి జంక్షన్ నుంచి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు ఆధ్వర్యంలో ఈ ర్యాలీ 23 వ డివిజన్ లోని ఇందిరా గాంధీ విగ్రహం, 24 వ డివిజన్ మీదుగా 25వ డివిజన్ పాపయ్యపేట్ చెమన్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేసి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన పాదయాత్రను ముగించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫోటోలు చేత పట్టుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మూడు డివిజన్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. నిండు పార్లమెంటులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలను వెనుక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందన్నారు. హరిజన, గిరిజన, బడుగు, బలహీన వర్గాలను వెనుక్కు నెట్టేస్తున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలు బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకుపోయి ఎండగట్టాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆనాడు మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజల కోసం చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కొత్తపల్లి శ్రీనివాస్, ఆకుతోట శిరీష్, తోట వేణు, మబ్బు ప్రవీణ్, భాషపాక సదానందం, కత్తెరశాల వేణుగోపాల్, జారతి రమేష్, మడిపల్లి కృష్ణ, మహమ్మద్ మోసిన్, చిప్ప వెంకటేశ్వర్లు, దామెర రాజ్ కమల్, గొండా రజిత, శ్రీనివాస్, ఎలగం లీలావతి, సత్యనారాయణ, కొక్కుల సతీష్, బసవరాజు రాజ్ కుమార్, కార్పొరేటర్లు సోమిశెట్టి ప్రవీణ్, భోగి సువర్ణ సురేష్, ముష్కమల్ల అరుణ సుధాకర్, పల్లం పద్మ రవి, బాసాని శ్రీనివాస్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం
- మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు
- రవాణా, పారిశుద్ధ్యం, భద్రతా, వైద్యం, ప్రచార చర్యలపై అధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమంలో ప్రవహించే “అంతర్వాహిని” సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని దేవాదాయశాఖ మంత్రి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ పుష్కరాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించినప్పటి నుంచి 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగుతాయని వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తిరిగి తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతుందని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర పుణ్యస్నానాలు ఆచరిస్తారని తెలిపారు. ఈ పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రారంభించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ‘సరస్వతీ పుష్కరాలు’ పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్లు మంత్రులు తెలిపారు. చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయని.. అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చాలా క్రీయాశీలకంగా పని చేస్తుందన్నారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం మాదిరిగా ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించుటకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చలువ పందిళ్లు, టెంట్‌లు, శాశ్వత మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కాళేశ్వరంకు సంబంధించిన వివరాలన్నీ వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియ జేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను విస్తృతంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు ఆదాయం చేకూరిందని, మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ వివరించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. ‘ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.

### పీఠాధిపతుల పుష్కర స్నానం..

సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమీక్షా సమావేశంలో భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్ అండ్ బీ ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, పంచాయతి రాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్, ఆలయ ప్రధాన ఉప ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# తోటి ఉద్యోగినీ వదల్లే..

- మెడికల్ బిల్ కోసం రూ.60వేల డిమాండ్
- ఏసీబీకి చిక్కిన ఇద్దరు జడ్పీ ఉద్యోగులు

**వరంగల్ వాయిస్, ములుగు :** డబ్బుల రుచి మరిగిన ములుగు జిల్లా పరిషత్ ఉద్యోగులిద్దరూ సహోద్యోగి అన్న మానవత్వాన్ని మరిచి లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీని ఆశ్రయించిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివారాల మేరకు.. ములుగు జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న నల్లబెల్లి వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురి కావడంతో లీవ్ తీసుకున్నారు. ఈ క్రమంలో మెడికల్ బిల్లులు సెటిల్ చేసి ట్రెజరీకి పంపించేందుకు సూపరింటెండెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ సౌమ్య రూ.60వేలు డిమాండ్ చేశారు. వారికి లంచం ఇవ్వడం ఇష్టంలేని వెంకటేశ్వర్లు ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించారు. పథకం ప్రకారం జడ్పీ కార్యాలయానికి చేరుకున్న వెంకటేశ్వర్లు రూ.20 వేలు సూపరింటెండెంట్ కు రూ. 5 వేలు జూనియర్ అసిస్టెంట్ కు ఇచ్చే క్రమంలో మొత్తం అమౌంటు సుధాకర్ కు ఇవ్వాలని సౌమ్య సూచించారని వివరించారు. దీంతో రూ.25 వేలు సూపరింటెండెంట్ సుధాకర్ కు ఇస్తున్న సమయంలో రైడ్ చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం వారిని జైలుకు తరలించనున్నట్లు డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ అధికారులు ఎవరైనా ప్రజలను లంచం కావాలని వేధిస్తే ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



# ముందస్తు సానిటేషన్ చర్యలు చేపట్టండి

- నగర మేయర్ గుండు సుధారాణి
- రఘునాథ కాలనీలో క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు సానిటేషన్ చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29 వ డివిజన్ లో మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్ష బీభత్సానికి రఘునాథ కాలనీలో విరిగిన మూడు కరెంట్ స్తంభాలను, చెట్టును పరిశీలించారు. డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించి వాటిని తొలగించేందుకు తగు సూచనలు చేశారు. అనంతరం డివిజన్ లో వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కనున్న గల్లి, పోతన రోడ్డు, బీట్ బజార్, నవీన్ టాకీస్ గల్లి ప్రాంతాల్లో శానిటేషన్ తీరును పరిశీలించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో ముందస్తు శానిటేషన్ చర్యల్లో భాగంగా శానిటేషన్ ను పక్కాగా నిర్వహించాలని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని, వరద వంపుకు గురి కాకుండా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నాలల డీసిల్టేషన్ ప్రారంభించుటకు ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ టెండర్ పిలిచి వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేసి చెత్తను రోడ్ మీద, డ్రైన్ లలో వేయకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి వార్డులలో చేపట్టబోయే సానిటేషన్ ప్లాన్ ను ముందుగా తయారు చేసుకొని అమలు చేయాలని 100శాతం గార్బేజ్ చెత్త సేకరణ జరగాలని, పోతన రోడ్ లో స్క్రాప్ దుకాణ దారులకు అనుమతులు ఉన్నాయో లేవో పరిశీలించి లేని వారికి నోటీసులు ఇచ్చి పెనాల్టీ విధించాలన్నారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పక్క సందులో ప్రమాదకరంగా ఉన్న ఎలక్ట్రికల్ వైర్లను గమనించిన మేయర్ వెంటనే వాటిని సరి చేయాలని ఎన్ పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బందికి డివిజన్ లో అనువుగా ఉన్న ఏదైనా ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి అన్నపూర్ణ భోజనం ఏర్పాట్లు చేసి సమయపాలన పాటించేలా చూడాలని మేయర్ సీఎంహెచ్ఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ భాస్కర్, ఎన్ పీడీసీఎల్ ఏఈ రవీందర్, లైన్ మెన్ సాంబయ్య, వర్క్ ఇన్ స్పెక్టర్ కంటేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి

## ● ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** రైతులు భూభారతి చట్టంపై పూర్తి అవగాహన పెంచుకుంటేనే భూ సంబంధిత సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిష్కరించడమే భూభారతి సదస్సుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మంగళవారం హనుమకొండ జిల్లాలోని నడికూడ మండలాన్ని భూభారతి నూతన రెవెన్యూ చట్టం అమలుకు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడంతో, ముస్త్యాలపల్లి, సర్వాపూర్ గ్రామాల్లో నిర్వహించిన భూభారతి సదస్సుల్లో ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ లను పరిశీలించి, రైతుల నుంచి అందిన దరఖాస్తులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు భూముల రికార్డులు, హక్కుల పరిరక్షణలో భూభారతి చట్టం కీలకపాత్ర పోషించబోతుందని అన్నారు. భూభారతి చట్టం అనేది గత చట్టాల్లోని లోపాలను సవరిస్తూ, మేధావులు, రైతు సంఘాలు, నిపుణులతో చర్చించి రూపొందించబడిందని, ఇది పూర్తిగా ప్రజా ప్రయోజనాలపై కేంద్రీకృతమైన చట్టమని వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధరణి బదులుగా భూభారతి చట్టాన్ని తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కొత్త చట్టం కింద న్యాయం అందించడానికి మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు, తహసీల్దార్ దగ్గర జరిగే పొరపాటును ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో సవరించుకునే అవకాశమున్నట్లు తెలిపారు. అవసరమైతే భూ ట్రైబ్యునల్ వరకు వెళ్లే అవకాశాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తోందన్నారు. ఉచిత న్యాయ సహాయ సేవలు, సరళమైన న్యాయ ప్రక్రియలు, పారదర్శకత వంటి అంశాలు భూభారతిని విశిష్టంగా మారుస్తున్నాయని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ వల్ల అనేక మంది పేద రైతులు నష్టపోయారనీ, వేల ఎకరాల భూములు గల్లంతైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గాన్ని భూ సమస్యల నుంచి విముక్తి కలిగించేలా తీర్చిదిద్దుతానని, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, వాటి వివరాలను రెవెన్యూ పరిధిలో ఫ్లెక్సీల రూపంలో ఉంచుతామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ఇంత సుస్థిరంగా, సరళమైన విధానాన్ని అమలు చేయడం చారిత్రాత్మకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.నారాయణ, తహసీల్దార్ జి.నాగరాజు, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రైతులు అప్రమత్తంగా ఉండాలి

## వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేందర్ నాయక్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగామ జిల్లాలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పూర్తి మద్దతుగా నిలుస్తామని వెస్ట్ జోన్ డీసీపీ రాజా మహేందర్ నాయక్ భరోసా ఇచ్చారు. మంగళవారం రఘునాథపల్లి మండలం నిడిగొండ గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన డీసీపీ రాజా మహేందర్ నాయక్, సీఐ ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి అక్కడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "రైతులు ఆరు నెలల పాటు కష్టపడి పండించిన పంటలు అకాల వర్షాలతో నష్టపోవడం బాధాకరం. అలాంటి పరిస్థితుల్లో ఎవరూ అధైర్యపడకుండా, ప్రభుత్వం పూర్తిగా మీతో ఉంది. ఎప్పటికప్పుడు పంటలపై నిఘా పెడుతూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పంట నష్టాలపై విచారణ కోసం సంబంధిత ఇన్‌చార్జిని అడిగి ఫైళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కస్తూరి ఇంచార్జి అఖిల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చౌక ధరల దుకాణంలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, జనగామ :** ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ పరిధిలో ఉన్న ఒక చౌక ధరల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ కూడా ఈ తనిఖీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రేషన్ సరఫరాపై ప్రజల స్పందనను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సరుకులు సకాలంలో, పారదర్శకంగా అందుతున్నాయా అనే అంశాలపై క్లుప్తంగా విచారణ చేపట్టారు. దుకాణంలో స్టాక్ నిల్వలు, వాటికి సంబంధించిన బోర్డులు, బయోమెట్రిక్ ఈ–పాస్ యంత్రాల పనితీరు, రిజిస్ట్రేషన్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్ వివరాలు పరిశీలించారు. అదే విధంగా, ఆ రోజు ఎంత మంది లబ్ధిదారులు రేషన్ తీసుకెళ్లారన్న వివరాలను అధికారుల నోటికి తెచ్చారు. బియ్యం నాణ్యతను దగ్గరుండి పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులకు నాణ్యమైన రేషన్ సరుకులు సమయానికి అందించాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని హితవు పలికారు. ఈ తనిఖీలో ఆర్డీఓ వెంకన్నతో పాటు ఇతర అధికారులు, డీలర్లు కూడా పాల్గొన్నారు.

# పెన్షన్ సవరణలను ఉపసంహరించాలి

## టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, జనగామ :** కేంద్ర ప్రభుత్వం పౌర సేవల నిబంధనల సవరణల చట్టం పేరిట పాత పెన్షన్ నిబంధనల్లో మార్పు చేయడాన్ని ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వారు జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2025–26 ఆర్థిక బిల్లులో భాగంగా గుట్టు చప్పుడు కాకుండా ఈ పౌర సేవల నిబంధనల సవరణ బిల్లు ప్రవేశ పెట్టిందని, ఈ సవరణ పాత పెన్షన్ (ఓపీఎస్)లో కొనసాగుతున్న పెన్షనర్ల జీవితాలకు గొడ్డలి పెట్టులాంటిదని, దాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల ఆర్థిక భద్రతకు భరోసా లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) ను రద్దు చేసి ఉద్యోగులందరికీ పాత పెన్షన్ ( ఓపీఎస్) అమలు చేయాలని ఒక వైపు దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ఉద్యమిస్తున్న తరుణంలో సీపీఎస్ స్థానంలో ఏ భద్రత లేని ఏకృత పెన్షన్ పథకం (యూపీఎస్) ప్రవేశపెట్టి గందరగోళానికి గురి చేస్తుందన్నారు. ఇప్పుడు మరో వైపు పాత పెన్షన్ పొందే వారికి కూడా అన్యాయం చేస్తూ అందులో సవరణలకు చేస్తుందని మండిపడ్డారు. ఈ సవరణల ద్వారా పెన్షన్ దారులకు వేతన సవరణలు ఉండవని, పెరిగే ద్రవ్యోల్బణాన్ని తట్టుకొని నిలబడే ఆర్థిక శక్తిని కోల్పోతారని, పెన్షనర్ల ఆర్థిక భద్రతకు ఇది భంగకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌర సేవల నిబంధనల సవరణల పేరిట పెన్షనర్లను దొంగదెబ్బ తీసిందని మండిపడ్డారు. పౌర సేవల నిబంధనల సవరణల బిల్లును వెంటనే రద్దు చేసి దేశంలోని ఉద్యోగులందరికీ పాత పెన్షన్ పథకం (ఓపీఎస్)ను కొనసాగించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎమ్మెల్యే నాయినిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పబ్లిక్ గార్డెన్ దగ్గర ఆదివారం రోజు వ్యాపారుల మధ్యలో జరిగిన గొడవకు ఎమ్మెల్యేకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ కల్లూరి పవన్ అన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి హనుమకొండ అభివృద్ధి కోసం మాత్రమే కృషి చేస్తున్న నాయిని రాజేందర్ పై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు మానుకోవాలని అన్నారు. ఇలాంటివి మానుకోక పోతే రాబోయే రోజుల్లో ప్రజలే సరైన బుద్ధి చేస్తారని హెచ్చరించారు.

# తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొంటది



**వరంగల్ వాయిస్, జనగామ:** జిల్లాలో మంగళవారం అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ధాన్యం తడిసిన సందర్భంలో కూడా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ స్పష్టం చేశారు. ఆయన ఆదేశాల మేరకు, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. ఈ క్రమంలో, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని తానేదార్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి సందర్శించారు. అక్కడ ధాన్యం తేమ శాతం, కొనుగోలు రిజిస్టర్లు పరిశీలించి, కేంద్రంలోని సౌకర్యాలు, లారీలు, టార్పాలిన్ల లభ్యత తదితర అంశాలపై అధికారులను ప్రశ్నించారు. కేంద్ర నిర్వాహకులకు ధాన్యం కొనుగోళ్లు పూర్తైన వెంటనే బస్తాలపై కాంటా వేసి మిల్లులకు తరలించాలని, ఓపీఎంఎస్ లో సమయానికి సమాచారం నమోదు చేయాలని సూచించారు. జిల్లా నలుమూలలలో – మాదాపురం, సింగరాజుపల్లి, చీటూరు, పటేల్‌గూడెం, కుందారం, వెంకటాద్రిపేట, సోలీపురం, పోతారం, వడ్లకొండ, అడవికేశ్వాపూర్, తిమ్మంపేట, విస్నూర్, చెన్నూర్, మంచుప్పుల, కన్నెబోయినగూడెం వంటి గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు సందర్శించి పర్యవేక్షించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే సురక్షితంగా నిల్వ చేసి, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రతి గింజను ప్రభుత్వ మద్దతు ధరకు తప్పకుండా కొనుగోలు చేస్తాం అని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హామీ ఇచ్చారు. ఈ పర్యవేక్షన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్నతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# చలివేంద్రం ఏర్పాటు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ డివిజన్ కుమార్ పల్లి ప్రాంతంలో 8వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఇప్ప రాకేష్ అధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేయగా స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మీ కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి వాహన దారులు, నడక దారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బైరి లక్ష్మీ కుమారి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉందని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరం ఉంటేనే బయటకు రావాలన్నారు .ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బీజేపీ నాయకుడు బైరి శ్రవణ్ కుమార్, డివిజన్ బీజేపీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్‌గా ఆచార్య రాజేందర్ కట్ల



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ యూనివర్శిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి డీన్‌గా ఆచార్య రాజేందర్ కట్ల నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీన్ ఆచార్య అమరావేణి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆచార్య రాజేందర్ 2005లో కాకతీయ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తన అధ్యాపక ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయన ఇప్పటి వరకు విభాగాధిపతిగా, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా, ఖమ్మం పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం పరీక్షల నియంత్రణాధికారిగా సేవలందిస్తున్నారు. ఆచార్య రాజేందర్ 65 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్రాలు సమర్పించగా, ఆయన రాసిన 5 పుస్తకాలు ప్రచురితమయ్యాయి. అంతేకాక, జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన 68 శాస్త్రీయ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆయన పర్యవేక్షణలో 18 మంది పరిశోధకులు పీహెచ్.డీ, 12 మంది ఎం.ఫిల్ పూర్తిచేశారు. ప్రస్తుతం ఆయన ఇండియన్ అకౌంటింగ్ అసోసియేషన్ వరంగల్ శాఖకు ప్రధాన కార్యదర్శిగా కూడా సేవలందిస్తున్నారు. ఆచార్య రాజేందర్ కట్లను వివిధ విభాగాలకు చెందిన బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హృదయపూర్వకంగా అభినందించారు.

# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ నూతన కమిటీ మంగళవారం ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన అంబేద్కర్ యువజన కమిటీ సభ్యులంతా కమిటీ గౌరవ అధ్యక్షులుగా నత్తి సుధాకర్, పెరుమాండ్ల భిక్షపతి లు ఎన్నిక కాగా కమిటీ సభ్యులుగా మంద రవి, బరుపట్ల కిరీటి, సంగే మహేందర్, నత్తి కరుణాకర్, డాక్టర్ నత్తి చందర్ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ఆత్మకూరులో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను సిద్ధాంతాలను ప్రజల్లో విస్తృత పరచాలన్నారు. తన ఎన్నికలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తనువుల జంపయ్య, నత్తి ఆనందరావు, కోగిల సారంగపాణి, నాగెల్లి స్వామి, తనుగుల సాంబయ్య, మంద రవి, ప్రేమ్ కిషోర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామికి చందన పూజ



**వరంగల్ వాయిస్, గణపురం :** చందన పూజతో మానసిక, శారీరక రుగ్మతలు తొలగించబడుతూ, మనోవాంఛ సిద్ధించబడుతూ సకల సంపదలు లభిస్తాయనే నానుడితో బసవరాజు పల్లిలోని ప్రసిద్ధ ఆంజనేయ స్వామి దేవాలయంలో గ్రామ ప్రముఖులు మార్త శ్రీనివాసు చందన పూజతో స్వామి వారిని ఘనంగా పూజించారు. ఆలయంలో ఆంజనేయ స్వాములకు, భక్తులకు భక్తిశ్రద్ధలతో పవిత్రంగా వండించినటువంటి స్వామి వారి ప్రసాదాన్ని వితరణ చేయడంతో పాటు, 51 మంది మాల ధారణ చేసినటువంటి ఆంజనేయ స్వాములకు అందరికీ భిక్షా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. స్వామి వారి ఆశీస్సులతో బసవరాజు పల్లి గ్రామస్తులు అందరూ కూడా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించారు.

# లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ కమిటీ ఎన్నిక

## అధ్యక్షుడిగా జారతి శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం మంగళవారం శరణ్య హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేసుకుంది. ఈ సమావేశానికి స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధ్యక్షత వహించగా, పెద్దలు సోలా శ్రీను సార్, కర్ర నాగేశ్వరరావు సమక్షంలో కొత్త కమిటీని ఎన్నుకున్నారు. మార్కెట్‌కు సంబంధించి కమిషన్ వ్యాపారులు, మినీ హోల్ సేల్ వ్యాపారులు, కాంప్లెక్స్ వ్యాపారులు, చిల్లర వ్యాపారులు పాల్గొన్న ఈ సమావేశంలో వారిని ప్రతినిధులుగా తీసుకుని కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్ష పదవి కోసం జారతి శ్రీనివాస్, కర్ర వెంకటేశ్వర్లు, బేతి అశోక్ పోటీ పడ్డారు. చివరికి జారతి శ్రీనివాస్ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదే తరహాలో గులాం సర్వర్ మున్న ప్రధాన కార్యదర్శిగా, మల్లూరి బాబురావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యుల ఎంపికను వచ్చే రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ముఖ్యపాత్ర వహించిన కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్‌కు కమిటీ సభ్యులు, వర్తకులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడుతున్న కమిటీ అన్ని వర్గాలను కలుపుకుని మార్కెట్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సోంశెట్టి ప్రవీణ్, జారతి రమేష్ బాబు, చింతాకుల సునీల్, బేతి రాజు, జారతి వెంకట్, నాగరాజు, బిట్ల కృష్ణ, భక్తుల నవీన్, కొండా హరి, మహేష్, సురం రాజేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిధులు విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA)కింద పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల వేతనాలు చెల్లించేందుకు రూ. 62 కోట్లు విడుదల చేసింది. ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల బకాయి వేతనాలు విడుదల చేసింది. రాష్ట్రంలో ఈ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు మొత్తం 3,200 మందికి చెందిన రూ.62 కోట్ల వేతన బకాయిలు మంగళవారం విడుదలయ్యాయి. అయితే తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే తమ జీతాలు విడుదల చేయాలని గత కొద్ది రోజులుగా వీరంతా నిరసనకు దిగారు. దీనిపై స్పందించిన సర్కార్ నేడు ఆ పెండింగ్ బకాయిలను విడుదల చేసింది.

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి



**వరంగల్ వాయిస్, వరంగల్:** జిల్లాలో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద, వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి, దివిటిపల్లి గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సమావేశాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, వర్ధన్నపేట మండలం కాట్రియాల జడ్పీ హైస్కూల్లో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. పిల్లలు క్రీడలు మరియు ఇతర కార్యక్రమాల్లో పాల్గొనాలని, ఇది వారి శారీరక మరియు మేధో అభివృద్ధికి సహకరిస్తుందని ఆమె అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా కలెక్టర్ సందర్శనలు చేశారు. దమ్మన్నపేట కొనుగోలు కేంద్రంలో ప్యాడీ క్లీనర్లు, గన్ని బ్యాగులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన లారీ కొరతపై స్పందిస్తూ, అదనపు లారీ ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల స్థితిగతులపై సమీక్షిస్తూ, లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఆమె అధికారులను ఆదేశించారు. రామవరం గ్రామంలో మంచినీటి సరఫరా గురించి నేరుగా గృహిణిని ప్రశ్నించిన కలెక్టర్, ప్రతి ఇంటికి నీరు అందుతోందని తెలియజేయగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి రామిరెడ్డి, డబ్ల్యూఎస్‌డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ విజయసాగర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# రేపు మైనారిటీ గురుకులంలో ప్రవేశాలు

## లక్కీ డిప్ ద్వారా ఎంపిక




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** ములుగు మండలంలోని దేవగిరి పట్టణంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను (గురువారం )ఉదయం 10 గంటల 30 నిమిషాలకు డ్రా పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ వై.శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 26 విద్యా సంవత్సరంలో నాన్ మైనారిటీ విభాగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులను తల్లిదండ్రుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సకాలంలో హాజరుకావాలని కోరారు. లక్కీ డిప్ పర్యవేక్షకులుగా డీఎండబ్ల్యూఓ రవీందర్, ఆర్ఎల్ సీ రమేష్ లాల్ హట్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అకాడమిక్ కోఆర్డినేటర్ రుహీనా హాజరుకానున్నట్లు ఆమె తెలియజేశారు.

# శ్వేతార్కలో ముగిసిన వసంతోత్సవాలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** స్వయంభు శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో నిర్వహిస్తున్నటువంటి 27వసంతోత్సవాలు సత్యనారాయణ స్వామి వ్రతంతో ముగిశాయి. ఐదు రోజులపాటుగా నిర్వహించినటువంటి వసంతోత్సవాలు చివరి రోజు శ్రీ రమ సహిత సత్యనారాయణ ణ స్వామి వారి శాంతి వ్రతం నిర్వహించి కార్యక్రమం ముగించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పరిపాలన నిర్వహకులు అయినవోలు సాయి కృష్ణ శర్మ కళ్యాణి దంపతులు స్వయంగా పాల్గొని నిర్వహించారు. కార్యక్రమ బ్రహ్మగా కందికోట శ్రీనివాస్ శర్మ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యకర్తలు భక్తులు పాల్గొని పూజ ఫలితాన్ని పొందారు. అనంతరం భక్తులందరికీ అన్నపూర్ణ భవన్ లో అన్నదానం నిర్వహించినట్లుగా దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ అయినవోలు వెంకటేశ్వర శర్మ తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

మంగళవారం, మే 06, 2025

# రైల్వే సేఫ్టీకి ప్రాధాన్యతనివ్వాలి

➲ సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్
➲ కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా సీఐటీయూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి, నాయకులు కారు ఉపేందర్, ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, కోటి తదితరులు పాల్గొన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ, దేశంలో ఇటీవల వరుసగా జరుగుతున్న రైల్వే ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. లోకో పైలట్లు, మేనేజర్లు, ట్రాక్ మెయింటనెన్స్ సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు, వందలాది ప్రయాణికులు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇందులో ఎక్కువమంది పేద, వలస కార్మికులే ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. రైల్వే ఉద్యోగులపై తప్పును మోపడం అనైతికమని, దీనిపై కేంద్ర ప్రభుత్వం నైతిక బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రయాణికుల భద్రతను మెరుగుపర్చడమే కాకుండా, ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణాన్ని కల్పించాలని, రైల్వే ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని ఆయన అన్నారు. అలాగే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, రైల్వే విస్తరణ, భద్రత కోసం తగిన నిధులను కేటాయించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని రాగుల రమేష్ డిమాండ్ చేశారు.

# చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

◆ భీమనాథుని సత్యనారాయణ

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామం, భూపాలపల్లి పట్టణంలోని కార్ల్ మార్క్స్ కాలనీలో నివసించే చేనేత కార్మికుల కుటుంబాలను తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, భూపాలపల్లి జిల్లా పద్మశాలి సంఘం నాయకులు, చేనేత కార్మిక సంఘం ప్రతినిధి భీమనాథుని సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికులు రోజంతా శ్రమించినా వారికీ కనీసం రూ.300 కూడా గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. కాబట్టి, ప్రభుత్వం వారికి నెలకు కనీసం రూ.20,000 ఆదాయం వచ్చేలా పని అవకాశాలు కల్పించాలని కోరారు. అలాగే, చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ఇందిరమ్మ గృహాలు, ఆరోగ్య బీమా కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో పద్మశాలీలకు, చేనేత కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేత, పవర్ లూమ్ కార్మికులకు వృద్ధాప్య పింఛను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదుపరి, మగ్గం వేసే ప్రతి కార్మికుడికి జియోటాక్ కలిగి ఉండకపోయినప్పటికీ, 'చేనేత మిత్ర'పథకం కింద నెలకు రూ.2,500 మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** మావోయిస్టులపై అమలు చేస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంచాల భిక్షపతి గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కాశిబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. అనంతరం ముంజాల భిక్షపతి గౌడ్ మాట్లాడుతూ మావోయిస్టులతో చర్చలు జరిపేది లేదని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, ప్రజాస్వామ్యంలో చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని వెంటనే ఆయన తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఎన్టీ రామారావు, మర్రి చెన్నారెడ్డి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సహజ వనరులను, విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టె కుట్రలో భాగంగానే




ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను హత్య చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారని, కర్రెగుట్టల నుంచి పోలీసు బలగాలను వెనక్కి రప్పించి శాంతి చర్చలు జరపాలని ఆదివాసీ ప్రాణాల హననాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దళిత రత్న కేదాసి మోహన్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి తెలంగాణ కొమురయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పిట్టల రాజమౌళి, మంద నవీన్, గుండ్ల కాశీం, పారనందుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 20న మహా ధర్నాను జయప్రదం చేయాలి

● రామ రాజేష్ ఖన్నా పిలుపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరగనున్న ఇందిరా పార్క్ మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హక్కుల కోసం నిర్వహిస్తున్న ఈ మహా ధర్నాలో ఏఐటీయూసీ అనుబంధంగా యూనియన్ పాల్గొననుంది. ఈ నేపథ్యంలో యూపీహెచ్‌సీ ఎస్.ఆర్.ఆర్.తోట డాక్టర్ అనితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూఎన్‌హెచ్ఎం పరిధిలోని 78 క్యాడర్లలో పనిచేస్తున్న సుమారు 17,541 మంది ఉద్యోగులు పలు సమస్యలతో పోరాడుతున్నారని తెలిపారు. వారి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం అందరూ ఈ ధర్నాలో పాల్గొనాలని, ఇది ఒక్కరోజు ధర్నా అయినా నిరసనకు భారీగా హాజరై దానిని జయప్రదం చేయాలని కోరారు.



ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎస్.ఆర్.ఆర్.తోట నర్సింగ్ ఆఫీసర్లు మంజుల, గుడికందుల వాణి, ల్యాబ్ టెక్నీషియన్ మౌనిక, ఏఎన్ఎంలు నర్మదా, అనిత రాజేశ్వరి, సపోర్టింగ్ స్టాఫ్ కృష్ణవేణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ గా బొమ్మసాని అనిల్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా సంస్థాగత పర్వంలో భాగంగా 8వ డివిజన్ నుండి జిల్లా కౌన్సిల్ మెంబర్ గా బొమ్మసాని అనిల్ యాదవ్ ఎన్నిక అయ్యారు.. ఈ సందర్భంగా అనిల్ యాదవ్ ప్రకటనలో నాపై నమ్మకంతో జిల్లా కౌన్సిల్ మెంబర్ గా అవకాశం కల్పించిన హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డికి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డికి, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతని తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

# ఘనంగా మోతిలాల్ నెహ్రూ జయంతి



**న్యూఢిల్లీ, వరంగల్ వాయిస్ :** భారత జాతీయ కాంగ్రెస్ స్వతంత్ర పూర్వజాతీయ అధ్యక్షుడు, ప్రఖ్యాత న్యాయవాది, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తండ్రి మోతిలాల్ నెహ్రూ జయంతిని ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోతిలాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారు మోతీలాల్ నెహ్రూ సేవలను స్మరిస్తూ ఆయన దేశానికి చేసిన గొప్ప సేవలను కొనియాడారు.

# ఏవీవీ స్కూల్ టాపర్స్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా మాడిశెట్టి శశాంత్ నిలవగా, ద్వితీయ స్థానాన్ని రేకులపెల్లి నైపుణ్య సంపాదించింది. ఈ సందర్భంగా విద్యా సంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డా. చందా విజయ్ కుమార్, శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, డా.విజయ్ కుమార్ కుటుంబ సభ్యురాలు రాజేశ్వరి, ప్రిన్సిపాల్ డా.భుజేందర్ రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ వాసుదేవులు, సంకతాల సంజీవ టాపర్స్‌ను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఉపాధ్యాయులు సంధ్యారాణి, నవీన్, భాగ్యలక్ష్మి, రమాదేవి, నిహారిక, అనూషల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో నిలవాలని, ఇతరులకు ఆదర్శంగా మారాలని వారు ఆకాంక్షించారు.

# సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డిజిటల్ టెక్నాలజీ నుపయోగించి విద్యార్థులలో విషయ పరిజ్ఞానాన్ని పెంచడం, ఆటలు నేర్పించడం, డ్రాయింగ్, క్రాఫ్ట్ వర్క్స్ లో నైపుణ్యం అందించడం లక్ష్యంగా సమ్మర్ క్యాంప్ పని చేస్తుందని స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నరసింహారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులలో సమ్మిళత విద్యనందించడం, సృజనాత్మకతకు పెద్ద పీట వేస్తుందని నరసింహారావు పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 20 వరకు 15 రోజుల పాటు క్యాంప్ నిర్వహించబడుతుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి గం.10.30 వరకు పాఠశాల పని చేస్తుందని, స్నాక్స్ ఇవ్వడం జరుగుతుందని విద్యార్థుల తల్లి దండ్రులు ఈ సదవకాశంను ఉపయోగించుకోవాలని కోరారు. ఎన్.అప్పిరెడ్డి, కె.శంకర్, జి.బిచ్చ, టి.సమిత, సలోమి పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తొర్రూరు పట్టణ కేంద్రంలోని శారద హైస్కూల్ లో 2003-04బ్యాచ్ పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మే ళనం సోమవారం పట్టణ కేంద్రంలోని సాంప్రదాయ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరుపుకున్నారు. పూర్వ విద్యార్థులందరి ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ 22 సంవత్సరాల నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత వారంతా ఒక చోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. చిన్ననాటి నాటి మిత్రులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు శారద హైస్కూల్ హెచ్ఎం టి.శారద లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యాయులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు వారి అనుభవాలను ప్రస్తుతం వాళ్లు చేస్తున్న వృత్తి ఉద్యోగాలు, కుటుంబ సభ్యుల గురించి చెబుతూ భావోద్వేగానికి గురయ్యారు. ఫంక్షన్ హాల్ మొత్తం ఒక పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గాలి దుమారంతో కూలిన ఇంటి పైకప్పు



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నిన్న రాత్రి చోటుచేసుకున్న ప్రకృతి వైపరీత్యం కారణంగా నానామియా తోట ప్రాంతంలో భారీ గాలి దుమారంతో పాటు రాళ్ల వర్షం సంభవించింది. ఈ దుర్ఘటనలో గాయపడిన బాధితుల విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు.ఈ ఘటనలో సింగారపు కృష్ణ ఇంటిపై పక్కనే ఉన్న ఇంటి పిట్టగోడ కూలి పడింది. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న సింగారపు కృష్ణ, సింగారపు శ్యామ్‌పై ఇటుకలు పడటంతో వారు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్పొరేటర్ రవి వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫర్నీచర్, కూలర్, టీవీ, సెల్, వాషింగ్ మిషన్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇది ఒక నిరుపేద కుటుంబమని, వీరికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో నివాసం కోల్పోయిన బాధితుల వివరాలను ఖిలా వరంగల్ మండల ఆర్ఐ కీర్తన్ కు తెలియజేసినట్లు తెలిపారు. పరామర్శించిన వారిలో సింగారపు బాబు, కెంచ కుమారస్వామి, దూడబాల కొమురెల్లి, ఆలం కొమ్ము లింగమూర్తి, కొమ్ము కుమార్ స్వామి తదితరులు ఉన్నారు.

## పెండింగ్ స్కాలర్ షిప్ లు విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నేతలు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, పరకాల పట్టణంలో ఎస్సీ బాలుర కోసం కొత్త సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మించాలి, అలాగే ఎస్ఎంహెచ్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. అంతేకాకుండా, పరకాల పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మడికొండ ప్రశాంత్ పాల్గొన్నారు.

## నూతన డీఈఓకు సన్మానం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** జనగాం జిల్లా కొత్త డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి డీఈఓ భోజన దర్శనంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయంలో ఆయనను శాలువాతో సత్కరించి, పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తొలగిస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. అలాగే, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగ్స్, యూనిఫార్మ్‌లు, టైలు, బెల్టులు అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, వీటి విక్రయానికి కౌంటర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ ఉంచాలని కోరారు. డీఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ గుగులోతు చంద్రభాను పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా చీమల భిక్షపతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** భారతీయ జనతా పార్టీ పర్వతగిరి మండల నూతన అధ్యక్షుడిగా దౌలత్ నగర్ గ్రామానికి చెందిన చీమల భిక్షపతి నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు

### కాంగ్రెస్ సీనియర్ నేత అంబాల రాజు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** తెలంగాణ రాష్ట్ర బలహీనవర్గాల, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం రవాణా శాఖ అభివృద్ధిపై సరైన దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పెద్ద ఎత్తున సమ్మెకు దిగినప్పటికీ, ప్రభుత్వం ప్రైవేట్ డ్రైవర్లను నియమించి బస్సులు నడిపించిందని, వారిలో అనుభవం లేకపోవడంతో ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సమ్మెలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిని బెదిరించి, ఉద్యోగాల నుంచి తొలగిస్తానని హెచ్చరించారని, బూటకపు హామీలతో మోసం చేశారని అన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ఆర్టీసీ అభివృద్ధి చెందుతోందని, మహిళల ప్రయాణానికి ఉచిత బస్సు సేవలు ప్రారంభించడమే కాకుండా, పాత బస్సులను తొలగించి కొత్త బస్సులు, ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆర్టీసీ యూనియన్ల నాయకులు తమ సమస్యలను మంత్రికి వివరించగా, మంత్రితక్షణమే స్పందించి, ఆ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని చెప్పారు. అలాగే, "మీరు సమ్మెకు దిగవద్దు, నేను మీ కోసం 24/7 పనిచేస్తాను" అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దీంతో యూనియన్ నేతలు సమ్మెకు దిగబోమని తెలియజేశారని అంబాల రాజు పేర్కొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనం సమీపంలో తొర్రూరు పురపాలక శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని మంగళవారం పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక అధికారులు, సిబ్బంది, వలంటీర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో నిరాశ్రయులు, వృద్ధులు, రోడ్డుపై నివసించే వారికి దాహార్తిని తీర్చేందుకు ఈ చలి వేంద్రం ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం శ్రామికులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. స్థానిక సంస్థల భాగస్వామ్యంతో అందరికీ రక్షణ కలిగించేందుకు ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. పౌరులు కూడా ఈ ప్రయత్నానికి సహకరించాలని, అలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఇది కేవలం ప్రభుత్వం ఒంటరిగా చేయగలిగేది కాదు. మన సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించి ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలి, అవసరమైన వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## విలేకరుల బెదిరింపులు

### కేసు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బెదిరింపులకు పాల్పడిన విలేకరులపై సోమవారం మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. కరీమాబాద్ శాంతినగర్ కు చెందిన తిప్పని మహేందర్ స్థానికంగా "తిప్పని బ్రదర్స్ బిల్డింగ్ మెటీరియల్స్, సప్లయర్స్" దుకాణం నిర్వ హిస్తున్నారు. గత నెల 11న కుమార్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను గమనం పత్రిక (ఆన్ లైన్) ఎడిటర్ అని, ఇసుక నిల్వ చేసి అమ్మకాలు చేస్తున్నందుకు రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన పత్రికలో పనిచేసే రిపోర్టర్ వివేక్ ను పంపించి, డబ్బులు ఇవ్వాలని, లేదంటే తన ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక, కంకర, ఇటుక ఉచితంగా అందించాలన్నాడు. లేనిపక్షంలో 'తిప్పని వారి అక్రమ దందా' అని కథనం రాస్తానంటూ బెదిరించారు. దీంతో బాధితుడు కాల్ రికార్డులు, ఇతర ఆధారాలతో మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు, సెక్షన్లు 308(2), r/w 62 బీఎన్ఎస్ ల కింద కేసు నమోదు చేసి, A1 కుమార్, A2 తుమ్మ వివేక్ లుగా పేర్కొంటూ, ఎఫ్ఐఆర్ (256/2025) చేశారు.





# క్యాథరిన్ థ్రెస్రాకు బంపర్ ఆఫర్

టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ– ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో  కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది.. మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు–గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఒకే అయ్యిందట. సెకండ్ హీరోయిన్ అయినప్పటికి చిరుతో ఒకటి రెండు పాటలు ఉండడోతున్నయట. అయితే ఇక్కడ క్యాథరిన్ చిరుకి సంబందించి ఓ వార్త వైరల్ అవుతుంది..ఏంటీ– అంటే.. చిరంజీతో నటించే అవకాశం క్యాథరిన్ కు 2017లోనే వచ్చిందట. 'ఖైదీ నెంబర్ 150' కోసం వివి వినాయక్ తొలుత ఆమెనే అనుకున్నారట. కానీ సుష్మితతో వచ్చిన విబేధాల కారణంగా క్యాథరిన్‌ని తప్పించి కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారట. ఇక కట్ చేస్తే తొమ్మిది సంవత్సరాల తర్వాత క్యాథరిన్ తిరిగి ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం.



# కర్నాటక షూటింగ్ ముగించిన ఎన్టీఆర్


జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు. కర్ణాటకలో మొన్నటి వరకు షూటింగ్ నిర్వహించారు. షూటింగ్ సెట్స్ నుంచి తాజాగా ఎన్టీఆర్ హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ వద్ద ఎన్టీఆర్ స్టైలిష్ లుక్ లో కనిపించారు. చూస్తుంటే చాలా రగ్గుడ్ లుక్ లో ఉన్నారు. కాస్త బక్కగా మారిపోయిన ఎన్టీఆర్.. గుబురు గడ్డంతో కొత్త లుక్ లోకి మారిపోయాడు. ఇందుకు సంబంధించిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ ఇలాంటి లుక్ లో గతంలో కనిపించాడు. మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నాడు. ఓ వైపు వార్–2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అది ఇంకా రిలీజ్ కాకముందే ప్రశాంత్ నీల్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 2026 జూన్ 25న రిలీజ్ చేస్తున్నట్టు– ఇప్పటికే ప్రకటించారు. త్వరలోనే విదేశాల్లో షూటింగ్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ మూవీ అంటే కచ్చితంగా ఎలివేషన్లు ఉండాల్సిందే. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కు ఎలాంటి ఎలివేషన్లు ఉంటాయో చూడాలి. ఈ మూవీలో ఇంకా నటీ–నటు–లను తీసుకుంటూనే ఉన్నారు.



# ఆవిషయంలో.. ముందే పర్మిషన్ తీసుకున్నా

అనసూయ భరద్వాజ్.. ఈ పేరుకు పరిచయం అక్కర్లేదు. బుల్లి తేరపై జబర్దస్త్ షో ద్యారా యాంకర్‌గా ఎంట్రీ– ఇచ్చి సెన్సేషన్ క్రియేట్ చేసింది. తన అందం, అభినయంతో చెరగని ముద్ర వేసుకుని, తనకంటూ స్పెషల్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇమేజ్ కాస్త తనకు వరుస సినిమా అవకాశాలు కూడా తెచ్చి పెట్టింది. ఇప్పటి వరకు 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప', 'ఖిలాడీ' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా పుష్ప 2, రాజాకార్ వంటి చిత్రాల్లో నటించింది. నెక్స్ట్ పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు : పార్ట్ 1' చిత్రంతో అలరించబోతోంది. అలాగే వీటితో పాటు–గా 'ఫ్లాష్ బ్యాక్', 'వోల్ఫ్' అనే చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇక మూవీస్ విషయం పక్కన పెడితే వ్యక్తి గతంగా అనసూయ చాలా స్ట్రాంగ్ అని చెప్పాలి. ఆమె వస్త్రధారణ పై ఎన్నో ట్రోల్స్ వస్తున్న ఎదుర్కొంటూ వారికి తగిన సమాధానం ఇస్తూ ఉంటుంది. అయితే తాజాగా ఈ అమ్మడు కెరీర్ విషయంలో తన ఫ్యామిలీ సపోర్ట్ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకుంది..ఇలాంటి బట్టలు వేసుకుంటే ఇంట్లో వారు ఆమెను ఏం అనడం లేదా? అని కొన్ని ప్రశ్నలు సోషల్ మీడియా వినిపిస్తున్నాయి వాటి మీద మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించగా.. అనసూయ మాట్లాడుతూ.. 'ఇంట్లో భార్యగా, కోడలిగా, తల్లిగా, ఒక మహిళగా నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉన్నాను. అందుకే నా కుటుంబం మొత్తం నా వృత్తికి ఎంతో సహకరిస్తారు. నా భర్త సుశాంక్ భరద్వాజ్ తో తెరపై 15 ఏళ్ల వరకు నా కెరీయర్ ఉంటుందని ముందే పర్మిషన్ తీసుకున్నా. అనుమతి తీసుకున్న తర్వాతే టెలివిజన్ రంగంలో అడుగు పెట్టాను. ఇక డ్రెస్సింగ్ విషయంలో నేను నా ఫ్యామిలీ క్లారిటీగా ఉన్నాం' అంటూ చెప్పుకొచ్చింది.

# తండ్రి కాబోతున్న వరుణ్ తేజ్



ప్రేమ పెళ్లి చేసుకున్ని మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి అందరికి షాక్ ఇచ్చారు. చాలా కాలంగా లవ్‌లో ఉన్నఈ జంట తమ బంధాన్ని సీక్రెట్ గా ఉంచారు. వరుణ్ తేజ్ – లావణ్య మధ్య ఏదో నడుస్తోందని మీడియా కోడై కూసింది. మెగా కాంపౌండ్‌లో లావణ్య త్రిపాఠి ఎక్కుగా కనిపిస్తుండటం.. మెగా –అల్లు కుటుంబాలలో ఏ శుభకార్యం జరిగినా పాల్గొనడంతో ఈ అనుమానాలకు తావిచ్చింది. ఇద్దరూ ఈ గాసిప్స్‌పై మౌనంగానే ఉన్నారు. కానీ మొత్తనికి తమ రిలేషన్‌పై మౌనం వీడిన వరుణ్ – లావణ్య పెద్దల అంగీకారంతో ఒకటయ్యారు. ఇక తాజాగా ఈ యంగ్ కపుల్స్ కు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ జంట త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వరుణ్ తేజ్, లావణ్య అఫీషియల్ గా ప్రకటించేసారు. ఒక బ్యూటిఫుల్ పిక్ ని షేర్ చేసుకొని తాము అతి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నట్టుగా రివీల్ చేశారు. వరుణ్ కూడా 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను' అని  క్యాప్షన్ పెట్టేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మొత్తనికి వరుణ్ తండ్రి కాబోతున్నాడు. మెగా ఫ్యామిలి లోకి మరో వారసుడు రాబోతున్నారు. మొన్నటి వరకు వైరల్ అవుతున్న ఈ వార్త కన్ఫర్మ్ అయ్యింది.



# 7వ రోజుకు చేరిన కల్యాణ బ్రహ్మోత్సవాలు

◆ ఉభయ దాతలుగా వ్యవహరించిన నాయీబ్రాహ్మణులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని సుప్రసిద్ధ శ్రీ భద్రకాళీ దేవాస్థానంలో శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారికి ఉదయం నిత్యాహ్నికం అనంతరం బలి ఉత్సవం నిర్వహించారు. ఉభయదాతలైన హనుమకొండ నాయీబ్రాహ్మణ సంఘం వారి ఆహ్వానం మేరకు అనేక మంది నాయీబ్రాహ్మణులు అలయానికి విచ్చేసి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించుకున్నారు. అనంతరం 500మంది మహిళలు అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. అమ్మవారిని భద్రకాళి మహాత్రిపుర సుందరిగా అలంకరించి రథసేవ జరిపించారు. నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నాగవెల్లి సురేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల నిర్వహణ అనంతరం రెండు వేల



మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అతిథులుగా సూర్యపల్లి శ్రీనివాస్, డాక్టర్ బండారు జగదీష్ బాబు, తూముల సాంబయ్య, డాక్టర్ జీవనాథ్, కురిమిల్ల రమేష్, శ్రీరాముల రమేష్, శ్రీరాముల నరేందర్, జగన్, సురేష్, శివ, సతీష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. దేవాలయానికి విచ్చేసిన భక్తులకు ఉచితంగా ప్రసాద వితరణ చేసినట్లు ఆలయ ఈఓ శేషుభారతి వెల్లడించారు.

# పోలీసుల పనితీరుపై సీపీ ఫోకస్

## మామునూర్, ఏనుమాముల, గీసుగొండ పోలీస్ స్టేషన్ ల సందర్శన



**వరంగల్ వాయిస్, క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం మామూనూర్ డివిజన్ పరిధిలోని మామూనూర్, ఏనుమాముల, గీసుగొండ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా మామూనూర్ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఆయన ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతున్నాయి.. ఎన్నిసెక్టార్లు ఉన్నాయి.. సెక్టార్ వారీగా ఎస్సైఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులపై ఆరా తీశారు. స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలన్నారు. ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాలు కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలన్నారు. ట్రై సిటీ పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామూనూర్ ఏసీపీ తిరుపతి, ఇన్ స్పెక్టర్లు రమేష్, రాఘవేందర్, మహేందర్ తో పాటు స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.

# రెస్టారెంట్లపై దాడులు

◆ ల్యాండ్ మార్క్, ఫుడ్ ఆన్ ఫైర్ రెస్టారెంట్ లో కుళ్లిన మాంసం స్వాధీనం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా పరిధిలోని పలు బడా రెస్టారెంట్లపై తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ, టాస్క్ ఫోర్స్ అధికారుల మంగళవారం దాడులు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్ జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగాయి. నగరంలో పేరుగాంచిన రెస్టారెంట్లలో వెలుగు చూసిన విషపు ఆహార పదార్థాలను చూసి అధికారులు నిర్ఘాంత పోయారు. అపరిశుభ్ర హోటల్ల జాబితాలో నక్కలగుట్ట ప్రాంతంలోని ల్యాండ్ మార్క్ హోటల్, నయీమ్ నగర్ లోని ఫుడ్ ఆన్ ఫైర్ రెస్టారెంట్ చేరాయని అధికారులు ప్రకటించారు. ఈ రెండు హోటల్లలోని వంట గదులు పూర్తిగా అపరిశుభ్ర, దుర్వాసనలో దర్శనమిచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మురికి, దుర్వాసనతో కూడిన రిఫ్రిజిరేటర్ లోనే ఆహార పదార్థాలను భద్రపరుస్తున్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా సుమారు రూ.45వేల విలువకలిగిన 32 కిలోల కుళ్లిన మాంసం, హానికర



ప్రమాదకర రంగులు కలిపిన చికెన్, కాలం చెల్లిన ఐస్ క్రీములు, పాల ప్యాకెట్లు, మసాలా పొడులు, ఫంగస్ తో కూడుకున్న కాలీఫ్లవర్, క్యాబేజీ ఇతర ఆహార పదార్థాలు లభ్యమైనట్లు వెల్లడించారు. అట్టి విషపు ఆహార పదార్థాలను స్వాధీన పరుచుకుని శాంపిల్లను అధికారులు ల్యాబ్ కు పంపించారు. మోతాదుకు మించి హానికర రసాయనాలతో కూడిన రంగుల వాడకంపై కుళ్లిన మాంసం, ఫంగస్ తో కూడుకున్న ఆహార పదార్థాల వాడకంపై రెస్టారెంట్ నిర్వాహకుడికి ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. 2006 చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఆహార కల్తీకి పాల్పడుతూ, నిబంధనలు పాటించకుండా హోటల్స్ నిర్వహిస్తున్నందుకు సదరు యాజమాన్యాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు కేసులు సైతం నమోదు చేశారు.



# రాజ్యాధికారమే లక్ష్యంగా.. బీసీలు మేల్కొనాలి

బీసీ నాయకులు, బీసీ ప్రజలారా – ఇది మన చరిత్రను తిరిగి రాసే సమయం. కుల గణన అనే మాట విన్నప్పుడే మనం ఉల్లాసంతో స్పందించాం. ఇది ఆనందించదగిన విషయం. ఎందుకంటే, ఇది మన జనాభా స్థితిని అధికారికంగా గుర్తించే మొదటి అడుగు. కానీ, కథ ఇక్కడితో ముగియదు.. అసలు కథ ఇక మొదలవుతుంది.

కుల గణన తర్వాత జరుగబోయే ప్రధాన పోరాటం – అధికారంలో మన వాటా సాధన. మన సంఖ్యను తెలుసుకున్నాక, అధికారంలో మన హక్కును ఇవ్వాలన్న దిశగా మన పోరాటం జరగాలి. కానీ అగ్రవర్ణాలు ఈ మార్పును స్వతహాగా అంగీకరించబోవు. వారు తమ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉండరు. అప్పుడు వారు చేసే పని ఏమిటంటే 'జాప్యం'. న్యాయమైన కారణాల పేరుతో అడ్డంకులు, కొత్త నిబంధనలు అని అనేక మాయాచాట్లతో ముందుకు వచ్చి, బీసీల వాటాను నిరాకరిస్తారు.

కాబట్టి, బీసీలుగా మనం సంఘటితం కావాలి. మన హక్కుల కోసం చట్టబద్ధంగా, వ్యూహాత్మకంగా పోరాడాలి. మన లక్ష్యం ఓట్లు గల ప్రతి ఒక్కరిని ప్రతిబింబించే ప్రజల ప్రభుత్వాన్ని నిర్మించడం. జనాభా పరంగా మనం మెజారిటీలో ఉన్నాం. కానీ పాలనలో మాత్రం మనం అణచివేయబడుతున్నాం.

తెలంగాణ అసెంబ్లీలో మొత్తం 119 సీట్లు ఉన్నాయి. వీటిలో 19 ఎస్సీలకు, 12 ఎస్టీలకు రిజర్వ్ చేయగా మిగిలిన 88 సీట్లలో బీసీల సంఖ్య ఆధారంగా కనీసం 60 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండాలి. కానీ, ఇప్పటిదాకా మన సంఖ్యను తక్కువ చూపుతూ మన హక్కును కాలరాశారు. ఇదే పరిస్థితి లోకసభ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉంది. కుల గణన ద్వారా మన జనాభా స్థితి బహిర్గతం అయిన వెంటనే అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల్లో మనకు చట్టబద్ధ రిజర్వేషన్ ఉండాలని, తగిన వాటా ఇవ్వాలనే పోరాటాన్ని వాయిదా వేయకుండా ఇప్పటి నుంచే మొదలెట్టాలి.

ఈ దిశగా ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గం స్థాయిలో బీసీ సంఘాలు ఏర్పడాలి. బీసీ నాయకత్వాన్ని పెంపొందించాలి. యువత రాజకీయ చైతన్యాన్ని కలిగి, నాయకులుగా ఎదగాలి. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రతి చోట బీసీ అభ్యర్థులు నిలబడాలి. ఎవరి మోచేయి కింద నీళ్లు తాగకుండా, స్వయంగా ఎదగాలి.

బీసీ ఓటర్లు అమ్ముడుపోవద్దు. మన ఓటు విలువను మనమే అర్థం చేసుకోవాలి. ఓటు మన ఆయుధం.. మన శక్తి. డబ్బుతో ఓట్లు కొనే అగ్రవర్ణ నేతలు మనల్ని బానిసలుగా మార్చడానికి చూస్తున్నారు. అలాంటి బానిసత్వానికి గుడ్‌బై చెప్పి, రాజ్యాధికారాన్ని సాధించడమే మన నిజమైన స్వాతంత్ర్యం. ఈ పోరాటం నేడు మొదలై, భవిష్యత్ తరాలకు మార్గం చూపాలి.



జై బీసీ – జై జై బీసీ
సంఘటితం మన లక్ష్యం –
రాజ్యాధికారమే మన గమ్యం!

- వైద్యం రాజగోపాల్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com